RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 283 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 19-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 283 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 19-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS






## బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం: చంద్రబాబు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు.

**వైకాపా వచ్చాక బీసీలకు అన్యాయం:** "తెదేపా

తరువాయి 2లో..

# సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం..

### టెండర్లలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు

### సీఎం విజయ్ కార్యాలయం ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్పు

### రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకే ధ్వజం

### పాలనలో పారదర్శకత లోపించిందని ఆరోపణ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన కార్యాలయాన్ని ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మార్చాలని తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. సీఎం సిబ్బందికి సౌకర్యవంతమైన పని వాతావరణం కల్పించేందుకు ఈ మార్పు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించగా... కొత్త ఆఫీసు పనుల కోసం కేటాయించిన రూ. 5.5 కోట్ల టెండర్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయంటూ బీజేపీ, డీఎంకేలు ధ్వజమెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై బీజేపీ నాయకుడు కేశవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొత్త ఆఫీస్ పనులు ఇప్పటికే ప్రారంభమైన నెల తర్వాత, ఎలాంటి ఆన్‌లైన్ విధానం అనుసరించకుండా రూ. 5.5 కోట్ల టెండర్‌ను

తరువాయి 2లో..

# దేశ ప్రగతికి మీరే మార్గదర్శి..

### నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు బర్త్‌డే విషెస్

### 'ఎక్స్' వేదికగా విషెస్ తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

### దేశ ప్రగతికి మీ మార్గనిర్దేశం కొనసాగాలని ఆకాంక్ష

### సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రార్థన

తరువాయి 2లో..



# ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించండి: పాక్ సుప్రీం కోర్టు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ.. కుటుంబ సభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాన్ని పీటీఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకొని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయన్ను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని.. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. 'ఇమ్రాన్ ఖాన్ నాకు 35ఏళ్లకు పైగా తెలుసు. రాజకీయంగా ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఆయన ఒత్తిడిని ఎదుర్కోలేదు. కానీ, మూడేళ్ల జైలు జీవితంలో

తరువాయి 2లో..

# హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హర్మూజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తుతెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్

తరువాయి 2లో..



# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు..

### దేశంలోనే 2వ స్థానం: చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం

తరువాయి 2లో..

# ముందు మీ భద్రత మీరు చూసుకోండి.. పాక్‌కు తాలిబన్ల స్ట్రాంగ్ కౌంటర్

### ఉగ్రవాదంపై పాకిస్థాన్ ఆరోపణలను ఖండించిన తాలిబన్లు

### పాకిస్థానే ఐసిస్, ఆఫ్ఘన్ వ్యతిరేక గ్రూపులకు ఆశ్రయం ఇస్తోందని ఆరోపణ

### తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరిక



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

తమ దేశం నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇతరులపై నిందలు వేయడం మానుకుని, ముందుగా తమ దేశ భద్రతా సమస్యలను పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌కు హితవు పలికింది. ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్

తరువాయి 2లో..

# తెదేపాకు అండగా ఉన్నారనే బీసీలపై జగన్ కక్ష

### మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



తెదేపా వచ్చిన తర్వాతే బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలను చట్టసభలకు పంపిన పార్టీ తెదేపా అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. బలహీనవర్గాలు ఎప్పుడూ తెదేపాకు

తరువాయి 2లో..

### 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ..

# ఉలిక్కిపడిన పాకిస్థాన్!

### 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం

### భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన

### ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడంతో పాక్ ఎదురుదాడి

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, ఈ డాక్యుమెంటరీపై, భారత్‌పై ఎదురుదాడికి దిగింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు అత్యంత రహస్యంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# గుట్టు తెలిసిందిట... జగన్ ఇక ఆపేది లేదట !

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆలోచనలు వ్యూహాలు అన్నీ భిన్నంగా ఉంటాయి. అందరూ నడిచే దారిలో ఆయన నడవరు. నాటకీయంగా ఉంటాయని కొన్ని పనులు ఆయన అసలు చేయరు. తన మనసుకు ఏది నిజం అనిపిస్తే అది చేస్తారు. దానినే ఎప్పటికీ నమ్ముతారు. ఇక రాజకీయంగా చూస్తే జగన్ ది 17 ఏళ్ళ అనుభవం. మరో మూడేళ్లలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకోబోతున్నారు. ఈ సుదీర్ఘ కాలంలో జగన్ నేర్చుకున్న అనుభవాలు తక్కువేమీ కావని అంటున్నారు. అంతే కాదు ఆయనకు అన్నింటి కంటే జనం పల్స్ బాగా తెలుసు అని అంటున్నారు. జనాల భాష ఆయనకు అర్ధం అయినంతగా ఎవరికీ కాదని అంటున్నారు. మరి ఎందుకు ఓటములు అంటే పార్టీలో లోపాలే అన్నది కూడా తెలుసు అంటున్నారు. 2024 లో కూడా వైసీపీ దారుణంగా ఓడాల్సింది కాదని వైసీపీ వారే కాదు తటస్థులు విశ్లేషకులు కూడా అంటారు, పార్టీ కాడె వదిలేసిన క్యాడర్ పట్టించుకోని లీడర్ల వల్లనే అలాంటి రిజల్ట్ వచ్చిందని కూడా చెబుతారు. అందుకే జగన్ ఈసారి పక్కా ప్లాన్ తో ఉన్నారని అంటున్నారు. అన్ని రకాలైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు అని కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే 2024 భారీ ఓటమి తరువాత జగన్ కొన్నాళ్ళ పాటు తాడేపల్లి ఆఫీసులోనే ఉండిపోయారు. అలాగే జనానికి దూరం పాటించారు. ఇటీవలనే ఆయన బయటకు వస్తున్నారు. జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. అఫ్ కోర్స్ అవి పార్టీ నేతల పరామర్శలు అనుకున్నా కూడా జగన్ జనం మూడ్ ని కూడా అధ్యయనం చేయడానికే ఈ విధంగా చేస్తున్నారు అని అంటున్నారు. ఈ మధ్యనే జగన్ గోదావరి జిల్లాలు ఉత్తరాంధ్రా కర్నూల్ పర్యటనలు చేపట్టారు. ఎక్కడ చూసినా జనాలు తండోపతండాలుగా వచ్చారు. అంతటా ఒకే రకమైన ఆదరణ, ఒకే రకమైన అభిమానాన్ని జనాలు చూపించారు. దాంతో జగన్ తో పాటు వైసీపీ కూడా ఫుల్ జోష్ లో ఉంది అని చెబుతున్నారు. ఇక ఈ టూర్లు వైసీపీకి ఇచ్చిన కిక్ వేరే లెవెల్ అని అంటున్నారు. ఈ టూర్ల వల్ల వైసీపీకి అన్నీ మంచి రాజకీయ లాభాలే అని అంటున్నారు. వైసీపీ లీడర్ లో క్యాడర్ లో నిరాశను ఒక్కసారిగా ఉఫ్ అని ఊదేసినట్లు అయింది అని అంటున్నారు. జనంలో వైసీపీ ఉంది, కష్టపడితే విజయం మనదే అన్న ధీమా వారికి వచ్చింది అని అంటున్నారు. అంతే కాదు వైసీపీ కోసం ఏమైనా చేయవచ్చు, కూటమి ప్రభుత్వం మీద పోరాటం చేసినా జనాలు ఉన్నారు అన్న భరోసా కూడా వారిలో ఏర్పడింది అని అంటున్నారు. ఆ విధంగా జగన్ టూర్లు పార్టీలో ఫుల్ హుషార్ ని నింపాయని అంటున్నారు. అంతే కాదు కూటమి పెద్దలలో గుబులు కూడా తీసుకుని వచ్చాయని వైసీపీలో చర్చ సాగుతోంది. కేవలం రెండేళ్ళు మాత్రమే కూటమి పాలన పూర్తి అయిన ఈ తరుణంలో జగన్ వెంట జనాలు వెళ్తున్నారు అంటే కూటమి ఉలిక్కిపడేలా పరిస్థితులు ఉన్నాయా అన్న చర్చ కూడా అటు వైపు ఉంది. ఆ విధంగా కూటమిలో తర్జన భర్జనను పెంచేలా జగన్ టూర్లు చేయగలిగాయి అని అంటున్నారు. మరి తమకు పట్టు ఎంత ఉందో తెలిసింది, కూటమిలో గుబులు పెంచామని ఆ విధంగా వారి గుట్టు తెలిసిందని వైసీపీ అధినాయకత్వం భావిస్తోంది. పార్టీలో కూడా వేయి ఏనుగుల బలాన్ని ఇస్తోంది. కాబట్టి టూర్లు అసలు ఆపకూడదని అధినాయకత్వం గట్టిగా తీర్మానించుకుంది అని అంటున్నారు. తప్పు మనదే తప్ప జనాలది కాదు, గట్టిగా కష్టపడితే జనాలు మన వైపు చూసి ఆదరించి అక్కున చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు అని కూడా వైసీపీలో చర్చ సాగుతోంది. దాంతో ఈ దూకుడుని కంటిన్యూ చేయాలని జనంలో ఉంటూ జనంతోనే జగన్ అన్నట్లుగా రానున్న రోజులలో మరింత విస్తృతంగా పర్యటనలు చేయాలని వైసీపీ భారీ ప్లాన్స్ తో సిద్ధంగా ఉంది అని అంటున్నారు. జనాలలో జగన్ ఉంటే ఎన్ని ఆంక్షలు ఎవరు పెట్టినా రెట్టింపు బలంతో దూసుకుపోవచ్చు అన్నదే ఆ పార్టీ ఆలోచనగా ఉందిట. సో జగన్ ఇక మీదట మరిన్ని టూర్లకు రెడీ అవుతున్నారు. ఎప్పుడు ఎక్కడ అంటే వెయిట్ అండ్ సీ.

# 34 శాతం రిజర్వేషన్లు..

రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్‌గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాం. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక బీసీలకు అన్యాయం జరిగింది. రిజర్వేషన్ల పెంపుపై కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఉన్నత న్యాయస్థానం ఆ జీవోను కొట్టేసినా గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లలేదు. బీసీలకు ద్రోహం చేయడంలో వైకాపా నాయకుడు జగన్ నంబర్ వన్. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. దీంతో వైకాపా హయాంలో 16,800 మంది బీసీ నేతలు నష్టపోయారు. ఎంపీటీసీ నాగరాజును కర్నూలు ఎంపీగా చేసిన ఘనత ఎన్డీయేది. వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చాం.

**గతంలో బీసీ నేతలను వేధించారు**

వైకాపా హయాంలో అనేక మంది బీసీ నేతలను వేధించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడిని ఇబ్బంది పెట్టారు. తెదేపాకు మద్దతుగా ఉన్నారని అనేక మంది బీసీలను హత్య చేశారు. ఆయా వర్గాలపై కిరాతకంగా ప్రవర్తించారు. 56 బీసీ కార్పొరేషన్ల పేరిట నాటకాలు ఆడారు. డీఎస్సీపై 350 కేసులు వేసి ఇబ్బందులు పెట్టారు. ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్తే చరిత్రహీనులుగా మిగులుతారు.. జాగ్రత్త.

ఈ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు

తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ.95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం" అని చంద్రబాబు అన్నారు.

# సీఎం విజయ్ కార్యాలయం మార్పుపై దుమారం..

విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి కేవలం 100 రోజులు కూడా కాకముందే పాలనలో పారదర్శకత లోపించిందని, నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు కేటాయించడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు, డీఎంకే ఎమ్మెల్యే ఈవీ వేలు స్పందిస్తూ.. సీఎం తన కార్యాలయాన్ని మార్చుకోవడం ఆయన వ్యక్తిగత విషయమని, అయితే ప్రజాధనంతో ముడిపడి ఉన్న టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న వార్తలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. అయితే, ఈ అవినీతి ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి కేవలం 100 చదరపు అడుగుల స్థలం కూడా లేదని, వారికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకే ఈ తాత్కాలిక మార్పు చేపట్టామని వివరించారు. ఈ పనులకు సంబంధించి టెండర్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తేల్చిచెప్పారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ..

# ఉలిక్కిపడిన పాకిస్థాన్!

కట్టింది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం 'ఇంటర్-సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్' (ఐఎస్‌పీఆర్) ఈ డాక్యుమెంటరీపై స్పందిస్తూ, ఇది భారత్ సృష్టించిన కల్పిత కథనమని ఆరోపించింది. ఈ ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్న భారత వాదనలను అది తోసిపుచ్చింది. అయితే, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోయిందని, ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఉన్నతాధికారులు ఇటువంటి దూకుడు ప్రదర్శిస్తున్నారని భారత అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆపరేషన్ ధాటికి లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు తమ శిక్షణా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాలతో పాటు కీలక మౌలిక వసతులను, కేడర్‌ను భారీగా కోల్పోయాయి. తాజాగా విడుదలైన ఈ డాక్యుమెంటరీ పాకిస్థాన్ పాత గాయాలపై కారం చల్లినట్లయిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, డాక్యుమెంటరీ ప్రామాణికతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా నిరంతర ప్రచార దాడులు నిర్వహించాలని ఐఎస్‌పీఆర్‌కు ఆదేశాలు అందినట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి భారత్‌పై పాకిస్థాన్ ఒక 'సమాచార యుద్ధాన్ని కొనసాగిస్తోందని, అందులో భాగంగానే సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేసే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

## తెదేపాకు అండగా ఉన్నారనే

# బీసీలపై జగన్ కక్ష

అండగా ఉంటున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. "1987లో మొదటిసారి ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1995లో చంద్రబాబు వాటిని 34 శాతానికి తీసుకొచ్చారు. 2020 వరకు స్థానిక సంస్థల్లో ఏ ఎన్నికలు జరిగినా ఎలాంటి ఇబ్బందీ లేకుండా 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. 2019లో జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి శని పట్టింది. బీసీలపై దమనకాండ జరిగింది. ఆ వర్గాల నేతలపై దాడుల చేసి హింసించారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తెదేపాకు బీసీలు అండగా నిలిచారు. అందుకే జగన్ కక్షగట్టారు. చట్టసవరణ చేయకుండా రిజర్వేషన్లు పెంచారు. బీసీలకు మాయమాటలు చెప్పారు. పెంచిన రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించి వాటిని అమలు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. బాధ్యత గల ప్రభుత్వం అయితే అప్పుడే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. కానీ అలా జరగలేదు. ఆదరాబాదరాగా 24 శాతంతో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. దీంతో బీసీలకు చాలా అన్యాయం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మేయర్ పదవులు చాలా వరకు బీసీలకు దక్కలేదు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో బీసీలకు సంబంధించిన పాత రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చాం. సకాలంలో స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోతాయి. అక్టోబర్‌లోపు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తాం. ఈ నేపథ్యంలోనే సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు" అని అచ్చెన్నాయుడు చెప్పారు.

**వైకాపా హయాంలో 16,800 పదవులను బీసీలు కోల్పోయారు: సవిత**

వైకాపా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,800 పదవులను బీసీలు కోల్పోయారని మంత్రి సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు గీత కార్మికులు, వడ్డెరలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, మత్స్యకారులకు పలు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించిందన్నారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామని, నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం శుభవార్త అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా హయాంలో బీసీలను అణచివేయాలని ప్రయత్నించారని చెప్పారు. తెదేపా బీసీ నేతలపై కేసులు పెట్టారని.. ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రయ్యను నడిరోడ్డుపై హత్య చేశారని.. నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్‌ను చంపేశారన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# దేశ ప్రగతికి మీరే మార్గదర్శి..

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన ఓ ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. నిర్మలా సీతారామన్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చంద్రబాబు ట్వీట్ చేశారు. "గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు అచంచలమైన శక్తితో దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈరోజు నిర్మలా సీతారామన్ పుట్టినరోజు కావడంతో ప్రధానమంత్రితో పాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ముందు మీ భద్రత మీరు చూసుకోండి.. పాక్‌కు తాలిబన్ల స్ట్రాంగ్ కౌంటర్

శాశ్వత ప్రతినిధి ఇటీవల మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో తాలిబన్లు విఫలమయ్యారని, ఆఫ్ఘన్ గడ్డను పాక్‌పై దాడులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ఘాటుగా స్పందించారు. పాకిస్థాన్ వ్యాఖ్యలు తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. సరిహద్దు దాటి ఉగ్రవాదులు తమ దేశం నుంచి వస్తున్నారనే ఆరోపణలను ముజాహిద్ తోసిపుచ్చారు. పాకిస్థాన్ తన సొంత భద్రతా వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఆఫ్ఘన్‌పై నిందలు వేస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా, పాకిస్థానే ఐసిస్ (దాయిష్) ఉగ్రవాదులకు, ఆఫ్ఘన్ వ్యతిరేక గ్రూపులకు ఆశ్రయం కల్పిస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని సాయుధ గ్రూపులకు పాక్ మద్దతిస్తోందని కూడా ఆయన ఆరోపించారు. పొరుగు దేశాలపై నిందలు వేయడం కంటే, తమ అంతర్గత భద్రతా సమస్యలపై దృష్టి పెట్టాలని పాకిస్థాన్‌కు ఆయన సూచించారు.

# హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి

ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమన్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం. హర్మూజ్ జలసంధి పూర్తిగా ఇరాన్ (×త్మీఖఅ) సైనిక దళాల నియంత్రణలోనే ఉందని ఇటీవల ఆ దేశ సైనిక ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫఘారి స్పష్టం చేశారు. ఇరాన్ నిర్దేశించిన నిబంధనలు, ముందస్తు అనుమతి లేకుండా ఏ నౌక కూడా జలసంధిని దాటలేదని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే వాణిజ్య నౌకపై దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది. యుద్ధానికి ముందు ప్రపంచ ముడిచమురు, సహజవాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు హర్మూజ్ జలసంధి మీదుగానే సాగేది. ప్రస్తుతం నౌకల రాకపోకలు దాదాపు నిలిచిపోయాయి. ఆదివారం కేవలం మూడు నౌకలు మాత్రమే ఈ మార్గంలో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు..

వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించండి: పాక్ సుప్రీం కోర్టు

అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీ నేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పీటీఐ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. తోషాఖానా, అల్-ఖాదిర్ ట్రస్ట్ తదితర కేసుల్లో శిక్ష పడటంతో ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండిలోని ఆడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

## గంటల వ్యవధిలో మిస్సింగ్ కేసును సేదించిన భీమిలి పోలీసులు



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 18**

భీమిలి మండలం మూలకూద్దు గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలు వారి ఇంటిలో ఉన్న ఇబ్బందులు ఉన్న కారణంగా ఇంటి నుండి వెళ్ళిపోగా ఆందోళన చెంది వాళ్ళు పిల్లలు కనిపించడం లేదు అని బీమిలి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు నమోదు చేశారు. పోలీస్ కమీషనర్ ఆదేశాలు మేరకు భీమిలి సీఐ దీవాకర్ యాదవ్ చొరవ తో పోలీసులు సాంకేతిక ఆధారాలతో పిర్యాదు ఇచ్చిన రెండు గంటల వ్యవధిలో ఇద్దరు బాలురను గుర్తించి, సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.పిల్లల తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## జీవీఎంసీ 6,7,8 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం

### జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మధురవాడ జోన్ పరిధిలోని 6,7,8 వార్డులలో పలు ప్రాంతాలకు ఆగస్టు 20, 2026 (గురువారం) తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా మెయింటెనెన్స్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ మధురవాడ జోన్లో త్రాగు నీటిని సరఫరా చేసే గోస్తని నది జలాలను పంపింగు చేయు 700 యం.యం. వ్యాసార్ధము కలిగిన ప్రధాన పైపులైన్ మధురవాడ పాత పెప్సీ కంపెనీ వద్ద మరమ్మత్తులకు గురైనందున దానిని మరమ్మతులు చేయుటకు గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 370 హెచ్పి మోటార్ ద్వారా త్రాగు నీటిని పంపు చేయడం ఆపివేయడం జరిగిందని, కావున వార్డు నెం.6 పరిధిలో రిక్షా కాలనీ, వైభవ్ నగర్, రేవళ్ళపాలెం, బక్కన్న పాలెం, పీఎం పాలెం, లక్ష్మీ వానిపాలెం, అశోక్ నగర్, పీఎం పాలెం- ఎల్ఐజి, ఎమ్ఐజి,ఆర్. హెచ్ కాలనీ, కే 1,కే 2,కే 3,ఎంమ్ 1 హౌసింగ్ కాలనీ మరియు అమరావతి కాలనీ, వార్డు నెంబర్.7 పరిధిలో చీ+హూ'ం కాలనీ, మిధిలాపురి వుడా కాలనీ పార్ట్ మరియు వార్డు నెంబర్. 8 పరిధిలో షిప్ యార్డ్ లేఅవుట్ తదితర ప్రాంతాలలో త్రాగునీటికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. తాగునీటి సరఫరాలో కలిగే అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ తరఫున ఆయన కోరారు. అత్యవసర ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపట్టడం జరుగుతుందని, నీటి ట్యాంకర్ ద్వారా నీరు కావలసిన పురప్రజలు మధురవాడ జోన్ నీటి సరఫరా సహాయక ఇంజనీర్లులను సంప్రదించగలరని, వార్డ్ నెంబర్ 6 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 8297652049, వార్డ్ నెంబర్ 7 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 9603152887, వార్డ్ నెంబర్ 8 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 9908477519 లను సంప్రదించాలని మంచినీటి విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు.

## ఆగస్టు 27న సౌత్ జోన్‌లో బహిరంగ వేలం

**-జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18:**

జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో షాపు రూములు, మార్కెట్ లు, కళ్యాణ మండపములను లీజుకు ఇచ్చుటకు 2026 ఆగస్టు 27న ఉదయం 11.00 గంటలకు సౌత్ జోన్ సూర్యబాగ్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జీవీఎంసీ సౌత్ జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలంలో షాప్ రూములు...స్ప్రింగ్ రోడ్ డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్ స్టాండ్ ఫేస్- లో, పద్మనగర్ వాణిజ్య సముదాయము, సూర్యబాగ్ వాణిజ్య సముదాయము ఫస్ట్ ఫ్లోర్ లో, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయము, ఆశీల్ మెట్ట వాణిజ్య సముదాయములలో షాపుకు, మార్కెట్ లు ఏవిఎన్ కాలేజీ దరి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్, నెహ్రూ బజార్ మార్కెట్, శ్రీ నగర్ మార్కెట్ లకు, కళ్యాణ మండపములు సైలాడ పైడితల్లి నాయుడు, శ్రీ పొట్టి శ్రీరాములు కళ్యాణమండపములకు లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలం నిర్వహించబడునన్నారు. కావున, ఆసక్తి గల వ్యక్తులు/సంస్థలు సదరు బహిరంగ వేలం నందు పాల్గొనవలసినదిగా కోరుతూ ఇతర వివరముల కొరకు సౌత్ జోన్ లో కార్యాలయ పర్యవేక్షకులను పని వేళలలో ఉదయం 10.00 గంటల నుండి సాయింత్రం 5.00 గంటల లోపు సంప్రదించవచ్చునని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

# ఏపీలో బీజేపీని అతిపెద్ద శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## బీజేపీ నేతలతో తెలుగుశక్తి అధినేత బి.వి.రామ్ భేటీ









**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీని భవిష్యత్తులో ఏకైక అతిపెద్ద రాజకీయ శక్తిగా (సింగిల్ లార్జెస్ట్ పార్టీ) నిలపడమే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుశక్తి అధినేత బి.వి.రామ్ ఆకాంక్షించారు. విశాఖపట్నంలోని హోటల్ గ్రాండ్ బేలో బీజేపీ ముఖ్య నేత నితిన్ నబీన్‌తో ఆయన మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 1998లో వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన తన పెద్దనాన్న దివంగత ఎస్‌బీపీబీకే సత్యనారాయణ సమయం నుంచి తమ కుటుంబానికి బీజేపీతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని రామ్ గుర్తుచేశారు. రాష్ట్రంలో స్థిరమైన పాలన, అభివృద్ధి కోసం ప్రజలు చూస్తున్నారని, భవిష్యత్తులో బీజేపీ సొంతంగా బలపడేందుకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నితిన్ నబీన్, ఏపీ ప్రగతికి కలిసి పనిచేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం సుజనా చౌదరి, ఎన్.ఈశ్వరరావు, ఆర్.కృష్ణయ్యలను కూడా బి.వి.రామ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

### ఘనంగా 376వ జయంతి వేడుకలు నిర్వహించిన జై యాత యువసేన సంక్షేమ సంఘం

### మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరోదాత్తుడంటూ కొనియాడిన కుప్ప రాజశేఖర్



**ఆనందపురం (సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18:)**

నిరంకుశ మొఘల్ పాలనను, భూస్వామ్య దోపిడీ వ్యవస్థను ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించిన చారిత్రక విప్లవ యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జై యాత యువసేన సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కుప్ప రాజశేఖర్ కొనియాడారు. మంగళవారం ఆనందపురం 24 కాలనీలో జై యాత యువసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

**సామాన్యుడి పోరాటం..**

గోల్కొండ కోటపై విజయం ఈ వేడుకల్లో కుప్ప రాజశేఖర్ మాట్లాడుతూ, 1650 ఆగస్టు 18న ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుత జనగామ) ఖిలాషాపూర్ లో సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్, తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడిగా నిలిచారని గుర్తుచేశారు. నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలతో బలమైన గెరిల్లా సైన్యాన్ని నిర్మించి ఔరంగజేబు నిరంకుశత్వాన్ని గడగడలాడించారని తెలిపారు. ఖిలాషాపూర్, తాటికొండ, భువనగిరి, వరంగల్ కోటలను జయించడమే కాకుండా, 1708లో చారిత్రక గోల్కొండ కోటపై విజయం సాధించి పాలించిన తొలి బహుజన నాయకుడిగా చరిత్రలో నిలిచారని ప్రశంసించారు. ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం బహుజనులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

**హాజరైన ప్రముఖులు**

ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, జై యాత యువసేన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముడసల శ్రీను, సంఘ సభ్యులు కుప్ప అప్పారావు, చుక్క గణేష్, చుక్క రాజు, పీతల రాజు, పీతల విజయ, కుప్ప లోకేష్, ముడసల బంగారాజు, చుక్క నర్సింగరావు, బుడుమూరి సత్తిబాబు, పీతల పైడమ్మ, చుక్క కొండమ్మ, ముడసల బంగారమ్మ, కుప్ప లీలావతి, వనము దేవి, గండి బోయిన, నాగల మౌనిక, రమణమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సమరశంఖం

### విశాఖ తూర్పులో ప్రియాంక దండి విస్తృత పర్యటన



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

విశాఖ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ప్రియాంక దండి ఎంవీపీ కాలనీ సెక్టార్-4లో విస్తృతంగా పర్యటించి, స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లాసన్స్ బే కాలనీలో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికుడు జీవన్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం కనిపించే ఎమ్మెల్యే, ఆ తర్వాత ప్రజా సమస్యలను గాలికొదిలేసి కేవలం శుభకార్యాలు, ఫంక్షన్లకే పరిమితమయ్యారని ఆయన విమర్శించారు. మరోవైపు, స్థానిక యువకుడు వంశీ మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత భవిష్యత్తును ఎమ్మెల్యే నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. చందాలు, మద్యం, అసాంఘిక ప్రవర్తనను ప్రోత్సహిస్తూ యువతను తన వెంట తిప్పుకుంటున్నారే తప్ప, వారి ఎదుగుదలకు ఎలాంటి తోడ్పాటు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావంతులైన నాయకులతోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. వీరి సమస్యలను సావధానంగా విన్న ప్రియాంక దండి, ప్రజల పక్షాన నిలబడి ఎక్కడి సమస్యలపై అయినా పోరాడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రత్యేకంగా యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేసి, స్టార్టప్‌ల ద్వారా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక ప్రజలు, యువత భాగస్వామ్యంతో విశాఖ తూర్పు నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

## ఆలయ పునః నిర్మాణ పనులు పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు

**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18 :మురమళ్ళ**

నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ పనులను,ఇంజనీరింగ్ అధికారులు టెక్నికల్ ఎడ్వైజర్ సుబ్బారావు, ఎస్ ఈ టి దుర్గేష్, డీఈ ఉదయ్ కుమార్, ఆలయ సిద్ధాంతి యనమండ్ర సత్య సీతా రామ శర్మ, చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం గర్భాలయ, అంతరాలయ, నంది మండపం సంబంధించి చిత్ర వనం పనులు, అధిష్టాన పీఠం, పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పూర్తి పారదర్శకతో నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. నమూనా మెప్ పరిశీలించారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాస రాజు, ఏ ఈ ఫణీంద్ర, తదితరులు ఉన్నారు.



# ఎస్.ఐ.ఆర్.లో నోటీసుల జారీ, హియరింగ్‌పై ప్రత్యేక దృష్టి

### నిర్ణీత గడువులోగా 100 శాతం నోటీసుల జారీ పూర్తి చేయాలి

### ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18:**

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో జారీ చేసిన నోటీసులపై సంబంధిత ఈఆర్వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్. ప్రచురితమైన రోజు నుంచి ఇప్పటి వరకు జారీ చేసిన నోటీసులు, వాటి డెలివరీ, హియరింగ్, తదినంతరం వివరాల అప్‌డేట్‌పై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఒక్కో ఈఆర్వో తమ నియోజకవర్గ పరిధిలో జారీ చేసిన నోటీసులకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. భీమిలి నియోజకవర్గంలో నోటీసుల జారీ పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటీసుల జారీలో ఎటువంటి జాప్యాన్ని సహించబోమని, ఒక్క రోజులో 100 శాతం నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో నోటీసుల డెలివరీని వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా వెంటనే సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేయాలని సూచించారు. ఓటర్ల నుంచి నోటీసులు తిరిగి స్వీకరించిన వెంటనే సంబంధిత వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో పూర్తయిన హియరింగుల వివరాలను తప్పనిసరిగా బీఎల్వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. గాజువాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నోటీసులను తక్షణమే జారీ చేయాలని స్పష్టం చేశారు. నోటీసుల డెలివరీ, హియరింగ్, వివరాల అప్‌డేషన్ వంటి ప్రక్రియల్లో జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణపై విద్యార్థినులకు అవగాహన





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్‌ఎస్‌ఎన్ రాజు, విశాఖపట్నం పర్యటనలో భాగంగా మధురవాడలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యులు విద్యార్థినులతో సమావేశమై బాలల హక్కుల ప్రాముఖ్యత, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరి బాధ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల, కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, మౌలిక సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు విద్యార్థినులకు బేటీ బచావో -- బేటీ పడావో, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బాల్య వివాహాల నిషేధ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ, విద్య, హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా బాధ్యత వహించాలని తెలిపారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ హరి వెంకట రమణ, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి సంతోషి కుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరి కృష్ణ, డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల జిల్లా కోఆర్డినేటర్ నూక రామ కృష్ణ, ప్రిన్సిపాల్ వి. రత్నవల్లి, సీడబ్ల్యూసీ సభ్యులు డా. ఉదయ్ కుమార్ దిగుమర్తి, సామ్ కుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో నీటి ఎద్దడి ప్రారంభం

### నీటిని పొదుపుగా వినియోగించాలంటూ

### శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిజ్ఞ



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

నగరంలో నీటి ఎద్దడి పరిస్థితులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు వినూత్న కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. నీటి విలువను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల చేత "నీటి సంరక్షణ ప్రతిజ్ఞ" చేయించింది. ఈ సందర్భంగా విద్యార్థులు "నీటిని వృథా చేయము, అవసరమైనంత మాత్రమే ఉపయోగిస్తాము, ప్రతి నీటి బొట్టును కాపాడుతాము" అంటూ ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలలో వినియోగించే బోరు నీరు, కుళాయి నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని శాంతినికేతన్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ వి. శణ్ముఖరావు, కరస్పాండెంట్ కె. సాయి చంద్రిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ వి. శణ్ముఖరావు మాట్లాడుతూ, "నీటి ఎద్దడి వచ్చిన తర్వాత ఆలోచించడం కంటే ముందుగానే జాగ్రత్త పడటం ఎంతో అవసరం. నీటి విలువను చిన్న వయసులోనే పిల్లలకు తెలియజేస్తే, వారు తమ కుటుంబాల్లోనూ, సమాజంలోనూ నీటి సంరక్షణపై అవగాహన కల్పించగలరు. ప్రతి ఒక్కరూ అవసరమైనంత నీటిని మాత్రమే వినియోగించి, ఒక్క చుక్క నీటిని కూడా వృథా చేయకుండా జాగ్రత్త పడాలి" అని అన్నారు. "నీరు ఉంటేనే జీవితం -- ప్రతి నీటి బొట్టును కాపాడుదాం, భవిష్యత్తును రక్షిద్దాం" అనే సందేశంతో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉద్యాన రైతులకు హెక్టారుకు రూ.2.47 లక్షలు



**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 18**

ఉద్యానవన తోటల విస్తరణ స్కీం కింద కొబ్బరి రైతులకు హెక్టార్ కు రూ.2,47,950 చొప్పున మూడేళ్ల పాటు అందించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న నాయుడుఅసెంబ్లీలో వెల్లడించారు. కోనసీమలో కాలువల్లో పూడికతీయనందున సముద్రపు నీరు వెనక్కి వస్తూ కొబ్బరి చెట్లు చనిపోతున్నాయి. కొత్త మొక్కల కోసం ఒక్కో దానికి రూ.1000 చొప్పున అందించే ప్రతిపాదనలు సిద్ధం చేసాం. అంతర పంటల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందిస్తామని మంత్రి తెలిపారు.

## సర్దార్ పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, సేవా కార్యక్రమాలు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి సందర్భంగా అమలాపురం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీదేవీ మార్కెట్ వద్ద అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తూ ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్లకు పండ్లు, బ్రెడ్ పంచిపెట్టి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమిత్ర హోమియో కేర్ అధినేత డాక్టర్ ఎ. నాగ అనీషా గౌడ్ సుమారు నూటయాభై మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, సంఘ సభ్యులు సమకూర్చిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు మట్ట రవికిశోర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.ముందుగా గౌడ కుల మూల పురుషుడు కౌండిన్య మహర్షి, పాపన్న గౌడ్ ల చిత్రపటాలకు పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ లండన్ నగరంలో ప్రసిద్ధ విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో పాపన్న గౌడ్ ఫోటో, చరిత్ర భద్రపరచడం గొప్పవిషయమని, మొఘల్ చక్రవర్తులు, రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించి, గోల్కొండ కోటను జయించి, అనేక కోటలను కట్టిన బహుజన వీరయోధుడు, శివ భక్తుడు పాపన్న గౌడ్ అని అన్నారు. మాజీ కౌన్సిలర్ మామిడిపల్లి రాంబాబు, టిడిపి నాయకుడు వాసంశెట్టి చినబాబు తదితరులు వైద్య శిబిరంలో పాల్గొని బహుజనులను సంఘటితం చేసిన పాపన్న గౌడ్ స్ఫూర్తితో సేవాకార్యమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. సంఘ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, కోశాధికారి అయినవిల్లి నాగేంద్రకుమార్, పూర్వ అధ్యక్షుడు వెలిగట్ల జగదీష్ కార్యక్రమాలను పర్యవేక్షించగా గౌడ సంఘ సభ్యులు మిద్దే బాబులు, మట్ట మహేష్, ఉర్రింకి రవి, మట్ట శ్రీనివాస్, దాసరి శరత్, మట్ట ప్రవీణ్, కొండేటి సురేష్, మార్గన చిరంజీవి, వెలిగట్ల సూరిబాబు,మట్ట శ్రీనివాసరావు,కొండేటి ప్రసాద్,మట్ట సుబ్రహ్మణ్యం తదితరులు సేవలందించారు.




## యువతను మాదకద్రవ్యాలకు దూరం చేద్దాం...!!

### వారి భవిష్యత్తుకు దారి చూపుదాం

**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

దేశంలో జనాభా అసమతుల్యత (డెమోగ్రాఫికల్ చేంజ్), యువతను నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాలు వంటి అంశాల పై చర్చించబోతున్నామని ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ చెప్పారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారత సమన్వయ బైఠక్ ఆనందపురం మండలం లో గల గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం ఆయన విజ్ఞాన విహార పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ,రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 'అఖిల భారత సమన్వయ బైఠక్' మూడు రోజుల పాటు జరగనుందని,ఆగస్టు 19వ తేదీ ఉదయం 9:00 గంటలకు ప్రారంభమై, ఆగస్టు 21వ తేదీ సాయంత్రం వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ బైఠక్ లో సంఘ ప్రేరణతో పనిచేస్తున్న మొత్తం 32 సంస్థలకు చెందిన ప్రధాన బాధ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశాలలో ప్రతినిధులు గా ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే, సహ సర్ కార్యవాహలు, ఇతర కేంద్ర బాధ్యులు పాల్గొంటున్నారని చెప్పారు. అలాగే సంఘ ప్రేరిత సంస్థలైన భారతీయ మజ్దూర్ సంఘ్ , విశ్వహిందూ పరిషత్ , భారతీయ జనతా పార్టీ , అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ , భారతీయ కిసాన్ సంఘ్, రాష్ట్ర సేవికా సమితి తదితర సంస్థల జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సంఘటనా కార్యదర్శులు హాజరవుతారని చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుంచి 49 మంది మహిళలతో కలిపి మొత్తం 253 మంది ప్రముఖులు, సంఘ ప్రముఖులతో కలిపి మొత్తం సుమారు 327 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ సంస్థలు ప్రజా సంక్షేమం, ప్రజలలో చైతన్యం తీసుకురావడం, వ్యవస్థాగత మార్పు మరియు సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమా లలో నిమగ్నమై ఉన్నాయని, అన్ని సంస్థల మధ్య పరస్పర సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చ జరుగుతుందని చెప్పారు.

**చర్చనీయాంశాలు...**

ఈ బైఠక్ నిర్ణయాత్మక (ఎగ్జిక్యూటివ్) సమావేశం కాదని, సమాజ హితం కోసం వివిధ సంస్థల మధ్య పరస్పర అనుభవాలను పంచుకుంటూ సమన్వయాన్ని పెంపొందించుకోవడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు, సామాజిక




మార్పులు సమస్యల పరిష్కారాలపై సమీక్ష జరుగుతుందని చెప్పారు.

**జనాభా అసమతుల్యత... (డెమోగ్రాఫిక్ మార్పులు)**

దేశంలో మారుతున్న జనాభా తీరుతెన్నులు, వాటి పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించ నున్నామని స్పష్టం చేశారు. యువత ను మాదకద్రవ్యాల నుంచి దూరం చేయటం (నశా ముక్తి) పై కార్యాచరణ రూపొందించాల్సి ఉందని అన్నారు. యువతలో పెరుగుతున్న దుర్వ్యసనాలపై ఆందోళన వ్యక్తం చేశారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన కార్యాచరణ, యువతలో చైతన్యం తీసుకురావడం అవసరమని అన్నారు సామాజిక సామరస్యం, పర్యావరణ అనుకూల జీవనశైలి,కుటుంబ ప్రబోధనం (కుటుంబ విలువలు), 'స్వ' భావన (స్వదేశీ/స్వ జాగృతి), పౌర కర్తవ్యాల పాలన అంశాలను సంఘ్ స్వీకరించిందని వాటిని విస్తృతంగా ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలని అంశాలపై చర్చిస్తామని చెప్పారు. అదే విధంగా ఆర్థిక అంశాలతో పాటు అన్ని రంగాలను సమతుల్యం చేసే సమగ్ర అభివృద్ధి నమూనాపై ఆలోచన చేస్తున్నామని దానిపై విస్తృతంగా చర్చిస్తామని అన్నారు. అభివృద్ధి కేవలం ఆర్థిక అంశాలకే పరిమితం కారాదని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని చెప్పారు. విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య క్షేత్ర సహ సంఘచాలక్ దూసి రామకృష్ణ, సహ ప్రచార ప్రముఖ్ ప్రదీప్ జోషి, ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, సహ ప్రచార ప్రముఖ్ వాసుదేవ రావు పాల్గొన్నారు.

## నాగబాబు నియామకంపై రౌతు నాగరాజు హర్షం ...!



**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వేములవలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రౌతు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు కొణిదెల నాగేంద్రరావు నాగబాబును నియమిస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ జీఓఆర్‌టీ నంబర్ 93ను ఈ నెల 17న జారీ చేసిందని తెలిపారు. ఈ పదవికి నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో అటవీ పరిరక్షణ, పచ్చదనం పెంపు ద్వారా 2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందని నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు జిల్లాస్థాయిలో పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లాస్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడం, కార్యక్రమాలను వేగవంతం చేయడం, వాటి పురోగతిని పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నిర్వహించనున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను జిల్లాస్థాయి వ్యవస్థలతో అనుసంధానం చేసి సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ నియామకం కీలకంగా నిలుస్తుందని నాగరాజు అన్నారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవులు, చెట్ల విస్తీర్ణాన్ని పెంచడం, పునర్వనీకరణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. ఏపీ గ్రీన్ ఏర్పాటు, దాని ఎగ్జిక్యూటివ్ కమిటీకి నాగబాబును చైర్‌పర్సన్‌గా నియమించడం పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని రౌతు నాగరాజు తెలిపారు.

## రిజిస్ట్రేషన్ చేసుకున్నది ఒకరు .. రికార్డుల్లో మరొకరి పేరు...!! -రెవెన్యూ లీలలు



**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

ప్రభుత్వ రికార్డుల్లో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి, రెవెన్యూ రికార్డుల్లో మాత్రం మరొకరి పేరిట ఉండటం పద్మనాభం, మండలం, కోరాడ, గ్రామంలో కలకలం రేపింది. పద్మనాభం మండల రెవెన్యూ అధికారుల అలసత్వం, అక్రమాల కారణంగా బాధితుడు రోడ్డున పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఆనందపురం, మండలం బంటుపల్లి వారి కల్లాలు, గ్రామానికి చెందిన వెన్ని అప్పలరాజు. 23-10-2024 న భీమునిపట్నం, ఎస్ ఆర్ ఓ, నందు డాక్యుమెంట్ నెంబర్ . 9372/2024 ద్వారా సర్వేనెంబర్ 141-4పి మరియు1331 లోని 0.138 సెంట్ల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. ఈసీ,కూడా ఆయన పేరు మీదే ఉంది. అయితే రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పు కోసం వెళ్లగా షాక్ తగిలింది. అప్పలరాజు పేరుకు బదులు తాళ్లపూడి సన్యాసమ్మ పేరు 1బి,రికార్డులో ఎక్కించారు. ఈ విషయమై అప్పలరాజు ఆర్.టి.ఐ ద్వారా సమాచారం కోరాగా నిజాలు వెలుగులోకి వచ్చాయి. పద్మనాభం మండల, డిప్యూటీ , తహసీల్దార్ డ పి ఐ ఓ కె . చంద్రశేఖర్. ఎస్సార్ . నెంబర్.35/2026 తేదీ.11-03-2026 ద్వారా ఇచ్చిన సమాధానంలో " డాక్యుమెంట్ నెంబర్. 9372/2024 ద్వారా అప్పలరాజు కొనుగోలు చేసినప్పటికీ, మ్యుటేషన్ సమయంలో సదరు సన్యాసమ్మ పేరు నమోదు చేయడమైనదని అని స్వయంగా ఒప్పుకున్నట్లు బాధితుడు తెలిపాడు. విచారణలో,ఫోర్జరీ మ్యుటేషన్, తాళ్లపూడి సన్యాసమ్మ, 04-01-2025 న తప్పుడు నోటరీ అఫిడవిట్ ఇచ్చి "ఈ భూమి 1990 నుండి తన అనుభవంలో ఉంది" అని అబద్ధం చెప్పినట్లు తేలింది. ఈ ఫేక్ పత్రాల ఆధారంగా పద్మనాభం, వీఆర్ఓ,ప్రవళిక, ఫీల్డ్ విచారణ చేయకుండా తప్పుడు రిపోర్ట్ ఇవ్వగా, డిప్యూటీ, తహసీల్దార్ కె . చంద్రశేఖర్, దానిని ఆమోదించి అక్రమ మ్యుటేషన్ చేశారని బాధితుడు ఆరోపించారు. బాధితుడి ఆవేదన...నా సొంత డబ్బుతో కొన్న భూమి, రిజిస్ట్రేషన్ నా పేరున ఉంది. అయినా రెవెన్యూ అధికారులు లంచం తీసుకుని మరొకరి పేరు ఎక్కించారు. నాకు నోటీసు కూడా ఇవ్వలేదు" అని అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు కోరుతూ ఆర్ డి ఓ , కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధితుడు ఆర్డీవో , జిల్లా కలెక్టర్ లకు ఫిర్యాదు చేశారు. అక్రమ మ్యుటేషన్ రద్దు చేసి, తన పేరు పునరుద్ధరించాలని, ఈ మోసంలో పాల్గొన్న డిప్యూటీ. తహసీల్దార్ కె . చంద్రశేఖర్, వీఆర్వో ప్రవళిక లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు అప్పలరాజు కోరుతున్నారు.

# మున్సిపల్ విద్యుత్ వ్యయం తగ్గించేందుకు సౌర విద్యుత్ ప్రాజెక్టు

## రెండు దశల్లో మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు – జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ఆగస్టు 18**

మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ వ్యయాన్ని తగ్గించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచేందుకు సౌర విద్యుత్ ప్రాజెక్టు అమలుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులతో తాగునీటి పంపింగ్ వ్యవస్థలు, వీధి దీపాలు, మున్సిపల్ కార్యాలయాలు తదితర సేవలకు సంబంధించి విద్యుత్ వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 288 విద్యుత్ కనెక్షన్ల ద్వారా నెలకు సుమారు లక్ష యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యుత్ చార్జీల రూపంలో నెలకు సుమారు రూ. 11 లక్షలు వ్యయం అవుతున్నందున, ఈ భారాన్ని తగ్గించేందుకు మొత్తం 1 మెగావాట్ సౌర విద్యుత్ ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టాలని ప్రతిపాదించారు.

**మొదటి దశలో 500 కిలోవాట్ల ప్లాంట్**

మొదటి దశలో నడిపూడి రా వాటర్ వర్క్స్ వద్ద స్థల పరిమితులను దృష్టిలో ఉంచుకుని 500 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు



చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ. 4.50 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో 75 శాతం, అంటే సుమారు రూ. 3.60 కోట్లను బ్యాంకు రుణం ద్వారా సమకూర్చుకునే ప్రతిపాదనపై కలెక్టర్ సమీక్షించారు. రుణంపై వడ్డీ రేటు, రుణ కాలపరిమితి, నెలవారీ చెల్లింపులు తదితర అంశాలను పూర్తిగా పరిశీలించి, మున్సిపాలిటీకి ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండే విధంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**రెండో దశలో ప్రభుత్వ భవనాలపై సోలార్**

రెండో దశలో ప్రభుత్వ భవనాలు, మున్సిపల్ ఆస్తులపై మరో 500 కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసి మొత్తం 1 మెగా వాట్ సామర్థ్యాన్ని సాధించాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో గుర్తించిన సుమారు 1,700 చదరపు మీటర్ల రూఫ్‌టాప్ ప్రాంతంలో 516 కిలోవాట్ల వరకు సౌర విద్యుత్ సామర్థ్యం సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. రెండో దశకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసి పరిపాలనా అనుమతుల కోసం సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా మున్సిపాలిటీపై విద్యుత్ వ్యయ భారాన్ని తగ్గించడంతో పాటు ప్రభుత్వ భవనాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కె.రాంబాబు, సోలార్ ఆస్ట్రిచ్ సీఈఓ రాజేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎం కె. పృథ్వీరాజ్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ బి. పవన్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సిహెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంక్షేమ సమితి సభ్యునిగా ముత్తాబత్తుల శ్రీనివాస్



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

ఆంధ్రప్రదేశ్ లోని జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత, నూతనముగా ఏర్పడిన, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు,బాలల సంక్షేమ సమితి (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సభ్యునిగా ముత్తాబత్తుల శ్రీనివాసరావు ఎంపిక జరిగినది. ఈయన సుమారు 9 సంవత్సరముల నుండి జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈయన బాలల సంరక్షణ అధికారిగా, జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. బాలల సంక్షేమం కొరకు, బాల్య వివాహాలు నిలుపుదల చేయడంలో, జిల్లాలో బాల బాలికలకు ఆదరణ, సంరక్షణ కల్పిస్తూ, జిల్లాలో బాలికల పట్ల అవగాహన కార్యక్రమాలు కల్పించడంలో, అనేక సేవలు అందిస్తున్నారు. ఈయన ఎంపిక కావడం జిల్లాలోని వివిధ సంఘాలు, నాయకులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.

## గల్లంతైన మత్స్యకారుల కోసం అధికారులు ప్రత్యేక గాలింపు చర్యలు...

### కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి : ఎంపీ హరీష్ బాలయోగి




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 18**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ లాండింగ్ సెంటర్ నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. వేటకు వెళ్లి మత్స్యకారులు మూడు రోజులు మాత్రమే కుటుంబ సభ్యులతో ఫోన్ అందుబాటులో ఉన్నారని, కానీ నేటికి వేటకు వెళ్లి 16 రోజులు కావస్తుందని వివరించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టిందని ఎంపీ హరీష్ అన్నారు.

## శ్రీ నరసింహాలయంలో అధికారుల పరిశీలన..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 18**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖా అధికారులు పరిశీలించారు. సూపరిడెంట్ ఆఫ్ ఇంజినీర్ దుర్గేష్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ సాంకేతిక లోప సలహాదారులు ఎస్ సుబ్బారావు ఆలయాన్ని, నూతన అన్నదాన భవనాన్ని, రథం షెడ్డు ను పరిశీలించారు. రెండు కోట్ల 80 లక్షలతో దాతలు నిర్మించే అన్నదాన భవనాన్ని తిలకించి చేర్పులు మార్పులు వివరించారు. క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి నూతన ఆలయం నిర్మాణం కొరకు స్తలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఉదయ్ కుమార్, పరివేక్షకులు పి విజయ సారధి, కిరణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 2 మహిళల హత్య కేసులు ఛేదింపు

## తాడూరులో అప్పు వివాదం, బిజినపల్లిలో భూ కౌలు గొడవ










**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 18**

నాగర్‌కర్నూల్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు మహిళల హత్య కేసులను పోలీసులు ఛేదించారు. తాడూరులో బొలెరోతో ఢీకొట్టి హత్య తాడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాకొండ గ్రామానికి చెందిన నాగి బంగారమ్మ (43) హత్యకు గురైంది. తాడూర్ గ్రామానికి చెందిన ఎన్నుపోతుల భీమయ్య (38) నిందితుడిగా గుర్తించి ఆగస్టు 18న అరెస్టు చేశారు. గత నాలుగేళ్లుగా బంగారమ్మతో భీమయ్యకు పరిచయం ఉంది. బంగారమ్మ పొలం అమ్మిన సమయంలో భీమయ్య కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలని బంగారమ్మ అడుగుతుండగా, డబ్బులు ఇవ్వకూడదనే ఉద్దేశంతో భీమయ్య హత్యకు పథకం వేశాడు. ఆగస్టు 15న డబ్బుల విషయమై మాట్లాడేందుకు బంగారమ్మను పొలం వద్దకు పిలిచాడు. అక్కడ గొడవ జరగడంతో సాయంత్రం 4 గంటల సమయంలో బొలెరో వాహనంతో బంగారమ్మను ఢీకొట్టి, ఆమెపై నుంచి రెండుసార్లు వాహనం నడిపాడు. తీవ్ర గాయాలతో బంగారమ్మ అక్కడికక్కడే మృతి చెంది. నిందితుడి నుంచి టీఎస్ 31 టీఏ 4888 నంబర్ గల బొలెరో వాహనం, వివో వై39 మొబైల్ ఫోన్, మృతురాలి బస్ టికెట్లు, ఆధార్ కార్డు, చేతి సంచిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**బిజినపల్లిలో గొంతు కోసి హత్య**

బిజినపల్లి మండలం ఇప్పల తండాలో 43 ఏళ్ల కేతావత్ చిట్టెమ్మ హత్య కేసును కూడా పోలీసులు ఛేదించారు. భూమి కౌలు విషయంలో విభేదాలే హత్యకు కారణమని తెలిపారు. మృతురాలి బంధువు కరావత్ హీరమ్మ ఏ హీరి నిందితురాలిగా గుర్తించి అరెస్టు చేశారు. భూమిలో తనకు వాటా, కౌలు ఇవ్వడం లేదన్న కోపంతో ఆగస్టు 15 రాత్రి మృతురాలి ఇంటికి వెళ్లిన హీరమ్మ సారాయి తాగుదామని చెప్పి చిట్టెమ్మను నిద్రలేపింది. మృతురాలు నిద్రలోకి వెళ్లిన తర్వాత కత్తితో గొంతు కోసి హత్య చేసి, వెండి కడియాలు, కాళ్లగొలుసులు అపహరించింది. పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితురాలి వద్ద నుంచి ఆభరణాలు స్వాధీనం చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు కేసుల దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సీఐ అశోక్‌రెడ్డి, తాడూర్ ఎస్సై రాములు, బిజినపల్లి ఎస్ఐ షంషాదిన్, కానిస్టేబుళ్లు రమేష్, భీముడు తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# రోడ్డు లేక రోజుకు ఎనిమిది కిలోమీటర్లు నడుస్తున్న విద్యార్థులు



**దొనబైలు: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 18:**

అన్నమయ్య జిల్లా, మదనపల్లె పరిధిలోని దొనబైలు గ్రామానికి ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న మట్టి రోడ్డుపై వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు ఉదయం నాలుగు కిలోమీటర్లు సాయంత్రం నాలుగు కిలోమీటర్ల చొప్పున రోజు 8 కిలోమీటర్ల అటవీ మార్గంలో నడిచి వెళ్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, కూలీలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసిన సమస్య పరిష్కారం కాలేదని, కనీసం నాలుగు కిలోమీటర్ల మేర సరైన రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని, విద్యార్థులు, స్థానికులు, ప్రభుత్వ అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

# నిరుద్యోగ యువతకు 650 ఉద్యోగావకాశాలు

## కొత్తపేటలో ఆగస్టు 20న మెగా జాబ్ మేళా

## – జిల్లా జాయింట్ కలెక్టర్ వైకోమ్ నిడియా దేవి

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని నిరుద్యోగ యువతకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ గురువారం కొత్తపేటలోని వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వైకోమ్ నిడియా దేవి తెలిపారు. కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట, వికాస సంస్థల సమన్వయంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార గోడపత్రికను మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ కంపెనీలకు చెందిన మానవ వనరుల ప్రతినిధులు పాల్గొని వివిధ విభాగాల్లో ఉన్న సుమారు 650 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నారని తెలిపారు. అభ్యర్థులకు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు విద్యార్హతలు, ధ్రువపత్రాల పరిశీలన తదితర ప్రక్రియల ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ తదితర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. స్థానిక ఉద్యోగాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ఉద్యోగ అవకాశాలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. యువత తమకు లభించిన మొదటి ఉద్యోగ




అవకాశాన్ని భవిష్యత్ ప్రగతికి పునాదిగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఉద్యోగ అనుభవంతో పాటు నైపుణ్యాలను అంచెలంచెలుగా అభివృద్ధి చేసుకుంటూ మరిన్ని మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఉద్యోగం ద్వారా స్వయం ఆధారితులుగా మారి గౌరవప్రదమైన జీవనోపాధిని పొందే దిశగా యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో జాబ్ మేళాకు హాజరై తమ అర్హతలకు తగిన ఉద్యోగాలను పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. పెద్దిరాజు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## వ్యసనానికి దూరంగా ఉంటే విజయం దగ్గరవుతుంది



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఈగిల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా "మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞ" కార్యక్రమం (మంగళ వారం) ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ డా.కె.పెద్ది రాజు మాట్లాడుతూ "మాదకద్రవ్యాలు మన ఆరోగ్యాన్ని, విద్యను, కుటుంబాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటం వారి జీవిత లక్ష్యాలను నాశనం చేసే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు "నో" చెప్పండి ఆరోగ్యకరమైన జీవితానికి "యస్" చెప్పండి, చెడు స్నేహాలు, ఒత్తిడి లేదా ఆసక్తి కారణంగా మాదకద్రవ్యాలను ప్రయత్నించవద్దని, మీ స్నేహితులు ఎవరైనా వ్యసనానికి గురవుతున్నట్లు గమనిస్తే వారిని విమర్శించకుండా, సరైన సహాయం పొందేలా ప్రోత్సహించాలని తెలియచేశారు. మన ప్రతి ఒక్కరి బాధ్యతతోనే మాదకద్రవ్య రహిత సమాజం, ఆరోగ్యకరమైన యువత, బలమైన భారతదేశం సాధ్యమవుతుందని ."వ్యసనానికి దూరంగా ఉంటే విజయానికి దగ్గరవుతారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబిస్తూ, సమాజంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి రమాదేవి, ఎన్ ఎస్ ఎస్, పి.ఓ,.డా.డి.సి.హెచ్.పాపారావు, అధ్యాపకులు డా.జి.శ్రీనివాసులు, డాక్టర్.కె.సత్యనారాయణ, ఈగిల్ కోఆర్డినేటర్ పి.సాయికృష్ణ, కె. ఎస్.న్ ప్రసాద్, బి. విజయకుమార్, ఏ. దీపికా దేవి, సి హెచ్.నాగ శ్రీలక్ష్మి, ఎం. హేమలత, కే.తిమోతి, కె. సిద్ధార్థ, జి.కమల, ఎన్. జానిక్యరాం, బి.సత్య, సి. హెచ్. విజయకుమార్, కె.సాయిలక్ష్మి, డి.కావ్య, కె.కనకరాజు, ఆఫీస్ సిబ్బంది, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మరో మూడు వేల టీచర్ పోస్టుల భర్తీ

**విజయవాడ (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 18**

మెగా డీఎస్సీ 2025 ద్వారా 15,941 ఉపాధ్యాయ నియమకాలను పారదర్శంగా పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ ఏడాది మరో 3, 000 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# మంత్రి సుభాష్ కృషితో నాలుగు దశాబ్దాల కబేలా సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసిన మంత్రి -కబేలా మూసివేతకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు**

**గతంలో ఎవరూ చేయలేని పని చేసి చూపిన మంత్రి వాసంశెట్టి సుభాష్ -కబేలా ప్రాంతాన్ని సందర్శించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, అధికారులు**



**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న కబేలా ( పశు వధశాల) సమస్యకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో ఎట్టకేలకు శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది. మంత్రి సుభాష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కబేలా మూసివేతకు, విద్యుత్ సరఫరా నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చోడవరం ప్రాంతంలోని కబేలాల వల్ల సంవత్సరాలుగా దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత 4 దశాబ్దాలుగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. రామచంద్రపురం ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఈ సమస్యను ప్రజలు పెద్ద ఎత్తున తీసుకురావడంతో, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి, ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో కబేలా మూసివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టబడింది.



**కబేలా ప్రాంతంలో అధికార యంత్రాంగం విస్తృత చర్యలు**

మంగళవారం పోలీసుల బందోబస్తు నడుమ మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కబేలా ప్రాంతానికి చేరుకుని చర్యలు చేపట్టారు. జేసీబీల సహాయంతో అక్కడ పేరుకుపోయిన పశు వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. శానిటరీ సిబ్బంది ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులో తిరిగి పశువధ జరగకుండా కబేలా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీంతో కబేలా కంపు సమస్యకు పూర్తిస్థాయిలో ముగింపు పలికే దిశగా అడుగులు పడ్డాయి.

**కబేలా నిర్వాహకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి -- మంత్రి సుభాష్ హామీ -మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం మాటపై నమ్మకం ఉంది - కబేలా నిర్వహకుడు**

ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా, కబేలా నిర్వహణపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకున్న మంత్రి సుభాష్, కబేలా నిర్వాహకులు చుట్టుగుళ్ల యోషయా, కొత్తూరు చిట్టెమ్మ (మోషే) లతో చర్చలు జరిపారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రి సుభాష్ విజయవాడ నుంచి ఫోన్ ద్వారా కబేలా నిర్వాహకుడు చుట్టుగుళ్ల యోషయాతో మాట్లాడి, అదే ప్రాంతంలో డైరీ ఫారం ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అన్ని అనుమతులు, ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. వాసంశెట్టి సత్యం నిర్వాహకులతో మాట్లాడి వారి జీవనోపాధికి భరోసా కల్పించారు. ఇరువురు మాటలకు సంతృప్తి వ్యక్తం చేసిన యోషయా మాట్లాడుతూ మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఇంతకాలంలో ఎవరూ ఇలా భరోసా ఇవ్వలేదని, మంత్రి సుభాష్ ప్రజా పాలన పై తనకు అపారమైన నమ్మకం ఏర్పడిందని, వారి మాటలు శిరసా వహిస్తూ అంగీకరించి, కబేలా నిర్వహణను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

**కబేలా ప్రాంతాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం...:** మంత్రి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో, ఆయన తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం కూటమి నాయకులతో కలిసి కబేలా ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యను మంత్రి సుభాష్ పరిష్కరించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా, అనేక మంది రాజకీయ నాయకులు హామీలు ఇచ్చినా సాధ్యం కాని పనిని మంత్రి సుభాష్ చేసి చూపించారని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ద్రాక్షారామం వచ్చే భక్తుల సౌకర్యం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

**ప్రజల ఆనందానికి అవధులు లేవు- మంత్రి సుభాష్ కు ప్రజలుకృతజ్ఞతలు..:** నాలుగు దశాబ్దాలుగా రామచంద్రపురం ప్రజలను పట్టిపీడిస్తున్న కబేలా సమస్యకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పరిష్కారం లభించడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని పని మంత్రి సుభాష్ చేసి చూపించారు" అంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సుభాష్ మరోసారి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డిఎస్పి ఎం శేషు, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు, మున్సిపల్, పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సురక్షితంగా కువైట్ నుండి స్వదేశానికి రప్పించిన జిల్లా యంత్రాంగం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళను సురక్షితంగా స్వదేశానికి జిల్లా యంత్రాంగం రప్పించారు. అయినవిల్లి మండలం కొండుకుదురులంక గ్రామానికి చెందిన పెట్టా అనంతలక్ష్మి కువైట్ దేశంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం, మైగ్రేషన్ మేనేజ్మెంట్ సెంటర్ సమన్వయంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి తీసుకురావడం జరిగింది. అనంతలక్ష్మి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2025 నవంబర్ నెలలో సత్యనారాయణ అనే ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం కువైట్ వెళ్లారు.ఒక కుటుంబంలో గృహ కార్మికురాలిగా పనికి పంపగా,అక్కడ తీవ్రమైన పని ఒత్తిడి తో ఆలా తట్టుకుని 8 నెలలు చేసింది ఎంత కష్టపడి పనిచేసినా యజమాని భార్య తరచూ శారీరకంగా,మానసికంగా వేధించేదని ఆమె తెలిపింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే మైగ్రేషన్ మేనేజ్మెంట్ సెంటర్ అప్పగించగా, జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ ఆదేశాలతో సంబంధిత ఏజెంట్‌తో నిరంతర సంప్రదింపులు జరిపి,బాధితురాలి పరిస్థితిని వివరించి, కుటుంబ సభ్యులు సంబంధిత ఏజెంట్ సహకారంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించినట్లు మైగ్రేషన్ మేనేజ్మెంట్ సెంటర్ నోడల్ అధికారి వి. సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్ తెలిపారు. భారతదేశానికి చేరుకున్న అనంతరం శ్రీమతి పెట్టా అనంతలక్ష్మి తన భర్త తో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ వైకోమ్ నిడియా దేవి ని కలిసి తమకు అండగా నిలిచిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం, మైగ్రేషన్ మేనేజ్మెంట్ సెంటర్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా

**ప్రిన్సిపల్ పెద్దిరాజు**



**కొత్తపేట, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

కొత్తపేట పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేటలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పెద్ది రాజు తెలిపారు. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ జెకెసి ఆధ్వర్యంలో,వికాస-ట్రైనింగ్ ప్లేస్మెంట్ సర్వీసెస్ సహకారంతో ఈ మెగా జాబ్ మేళాను ఆగస్టు 20, 2026 (గురువారం) ఉదయం 10:00 గంటల నుండి నిర్వహించనున్నారు. ప్రస్తుతం కొత్తపేట, పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఈ జాబ్ మేళా ఒక మంచి అవకాశమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రముఖ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, యువతకు నేరుగా ఉద్యోగ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఫాక్స్ కాన్, ప్రీమియర్ ఎనర్జీ, అపోలో టైర్స్, టీవీఎస్ సుందరం ఫాస్టెనర్స్, టాటా ఏ ఐ ఏ అవంతి సీ ఫుడ్స్, ఐసిఐసిఐ నెట్ బ్యాంక్, ఎస్బి మోటార్స్, అపోలో ఫార్మసీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొని వివిధ ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయి. వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న తుది సంవత్సరం విద్యార్థులతో పాటు, ఇప్పటికే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు మరియు కొత్తపేట, పరిసర ప్రాంతాలకు చెందిన అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది. అభ్యర్థులు తమ అప్డేట్ చేసిన రెజ్యూమ్లు (బయోడేటా), విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులు తీసుకుని, ఫార్మల్ డ్రెస్లో ఉదయం 10:00 గంటలకు ముందుగా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం జెకెసి కోఆర్డినేటర్ డా.జి. శ్రీనివాసులు (ఫోన్: 81798 24845)ను సంప్రదించవచ్చునని ఒక ప్రకటన లో తెలిపారు.

# మత్స్యకార బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

**అల్లవరం.సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

మండలంలోని ఓడలరేవు గ్రామానికి చెందిన మత్స్యకారులు వేటకు వెళ్ళి ఆచూకీ తెలియకుండా ఆందోళనలో ఉన్న ఓడలరేవు గ్రామానికి చెందిన కుటుంబాలను అనురాధ మంగళవారం పరామర్శించారు. అనంతరం గ్రామస్తుల ద్వారా నిత్యావసర సరుకులు పంపించి పంపిణీ చేయించారు.ఈ కార్యక్రమంలో మల్లాడి ఉమా మహేశ్వరరావు, తారాడి శివ, చిలకలపూడి రాజు, శ్రీను,పాలేపు లక్ష్మణ్,రేవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 14 నుండి 22 వరకు గణపతి నవరాత్రులు

## జిల్లా యంత్రాంగం నకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సహకరించండి

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 18**

వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జనం కు జిల్లా లో పగడ్బందీ ఏర్పాట్లు కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేశీధిర ప్రసాద్ పేర్కొన్నారు... మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం లో గణపతి నవరాత్రులు,నిమజ్జనం ఏర్పాట్లు పై సంబంధిత శాఖల అధికారులు,ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....పర్యావరణ పరిరక్షణ కు మట్టి గణపతి ని పూజిద్దాం అని,విగ్రహాల తయారీలో రసాయన రంగులకు బదులుగా సాధ్యమైనంత వరకు సహజ రంగులను ఉపయోగించేలా చూడాలని తెలిపారు..పర్యావరణానికి హాని కలగకుండా ఈ ఉత్సవాలను శాంతియుత వాతావరణం లో నిర్వహించేందుకు జిల్లా స్థాయి లో సమావేశ నిర్వహణ తో పాటు డివిజన్,మండల స్థాయి లో ఉత్సవ కమిటీ లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై గణేశ మందిరాలు లేదా పెద్ద మండపాలను ఏర్పాటు చేసేటప్పుడు,సంబంధిత శాఖల (రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు, విద్యుత్ మరియు అగ్నిమాపక శాఖలు) నుండి తప్పనిసరి గా అనుమతి పొందాలని,నవరాత్రి ఉత్సవాల సమయంలో మండపాల వద్ద ఉత్సవ కమిటీలు అగ్ని ప్రమాద నివారణ పరికరాలను (ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు మొదలైనవి) అందు బాటులో ఉండాలని తెలిపారు. ఈ పండుగల సందర్భంగా బాణా సంచా చేయరాదని,నిమజ్జన సమయంలో ఇతర పూజా సామాగ్రి మరియు ఆధార సంబంధిత పరికరాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడే అవకాశం ఉన్నందున,అటువంటి చర్యలను నివారించాలని తెలిపారు. నిమజ్జనం రోజులలో ఊరేగింపుల కోసం, సంబంధిత పోలీస్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని,ఏఏ రోడ్ల నుండి ఊరేగింపు జరుగుతుందో ముందుగా తెలియజేయాలని ,ఈ కార్యక్రమం నిమజ్జనం కోసం నిర్దేశించిన ప్రదేశాలలోనే జరిగేలానిర్వాహకులుసహకరించాలని తెలిపారు. ఒకేసారి అనేక విగ్రహాలు నిమజ్జనానికి రాకుండా, స్లాట్ పద్ధతిలో నిమజ్జనం నిర్వహించే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ,మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక, పోలీసు అధికారులు



సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి,గ్రామీణ ప్రాంతాలతో సహా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేశ విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను గుర్తించి, రెండు రోజుల్లోగా నిర్దిష్ట సిఫార్సుల తో కూడిన గణేశ విగ్రహాల నిమజ్జన ప్రదేశాల జాబితా ను సమర్పించాలని తెలిపారు.. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతం లో రాత్రి 10 గంటల తర్వాత మైక్ సెట్ల వాడకాన్ని నిలిపివేయాలని, పంచాయితీ పరిధి లో డిపిఓ... గ్రామ స్థాయిలో పంచాయితీ అధికారి... అర్బన్ పరిధి లో మున్సిపల్ కమిషనర్లు నిమజ్జన ప్రదేశాలలో క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు.నిమజ్జన ప్రదేశాల లో తగినంత విద్యుత్ దీపాల (లైటింగ్) ఏర్పాటు,పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు తో పాటు... మత్సశాఖ వారిచే పడవలు మరియు ఈతగాళ్ల ను అందు బాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాలన్నింటిలోనూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డి ఎం ,హెచ్ ఓ ను, మండపాల వద్ద అగ్ని ప్రమాద నివారణ పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు..నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడటం మరియు అవసరమైన చర్యలు తీసుకోవడం,ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని మరియు షిఫ్టుల వారీగా పనిచేసేలా సిబ్బందిని నియమించాలన్నారు. కమిటీ సభ్యులు గతంలో నిమజ్జన సమయంలో జరిగిన అంశాలను అందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశం లో డిఆర్ఓ డాక్టర్ తిప్పే నాయక్, ఇతర సంబంధిత శాఖల అధికారులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు..

# సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు..

**1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.**



**పోలవరం:(సిటిజన్ టైమ్స్) ఆగస్టు: 18**

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పోలవరం డీఎస్పీ కె. జై కృష్ణ సూచనలతో, పోలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో పోలవరం పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు.ఈ క్రమంలో పోలవరం మండలం తోటగొంది గ్రామ శివారు ప్రాంతంలోని కాలువ గట్ల వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన సారా తయారీ స్థావరాలను గుర్తించి తనిఖీ చేశారు. అక్కడ సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 1000 లీటర్ల బెల్లం పులుపు, సారా తయారీకి ఉపయోగించే పొయ్యిలు, డ్రమ్ములు మరియు ఇతర సామాగ్రిని గుర్తించి ధ్వంసం చేశారు.ఈ అక్రమ సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలవరం ఎస్సై పి. అప్పారావు తెలిపారు.పోలవరం మండలంలో అక్రమ సారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ఎక్కడైనా అక్రమంగా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని ఎస్సై సూచించారు.ఈ దాడుల్లో పోలవరం ఎస్సై పి. అప్పారావు, ఎక్సైజ్ ఎస్సై కె. నాగేంద్ర కుమార్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సునీల్ కుమార్, పోలీస్ మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, సిటిజన్ టైమ్స్ ఆగస్టు18**




జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎస్ .హరేంధిర ప్రసాద్ అధికారులు ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..లి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో స్థానిక సంస్థల నిర్వహణకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. పంచాయతీ ఎన్నికలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ను నేటి నుంచి ఈనెల 22 వరకు ఇంటింటా తనిఖీ చేసి, తుది జాబితాను సెప్టెంబర్ 07 ప్రచురించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఆగస్టు 31 నాటికి జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పంచాయతీ ఎన్నికలతో పాటు జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలన్నారు. ఆగస్టు 22 నాటికిఎంపీటీసీ, జడ్పిటిసీ జాబితా ను ప్రచురించాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని తుని, పెద్దాపురం, సామర్ల కోట,గొల్లప్రోలు,ఏలేశ్వరం మున్సిపాలిటీలలో వార్డులు వారీ గా సెప్టెంబర్ 03 న డ్రాఫ్ ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్ వారంలోపు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పనులు అన్నింటినీ సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు,డి పి ఓ వి.రవికుమార్, పెద్దాపురం,సామర్లకోట, గొల్లప్రోలు,ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 34% బీసీలకు రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మకం...

### ఎన్డీఏ కూటమి తీసుకున్న ఈ నిర్ణయం బీసీల పట్ల ఉన్న ఆదరాభిమానాలు, చిత్తశుద్ధికి నిదర్శనం...

### గొడ్డలి పార్టీ అన్యాయం చేసి తగ్గించిన రిజర్వేషన్లను నేడు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం...

### అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**కొత్తపేట సిటిజన్ ఆగస్టు 18**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గతంలో గొడ్డలి పార్టీ తీసుకున్న నిర్ణయాల వల్ల బీసీ వర్గాలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి క్యాబినెట్ లో నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువ నాయకులు నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాతే బీసీ వర్గాలకు గుర్తింపు, గౌరవం వచ్చిందన్నది చరిత్ర చెబుతున్న సత్యం అన్నారు. ఎన్డీఏ కూటమి తీసుకున్న ఈ నిర్ణయం బీసీల పట్ల ఉన్న ఆదరాభిమానాలు, చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.రాష్ట్ర రాజకీయాల్లో బీసీల ప్రస్థానం ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టక ముందు,తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాత అన్నట్లుగా ఉంటుందన్నారు. ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాత బీసీ వర్గాలకు సామాజిక న్యాయం లభించిందన్నారు. ఎందరో బీసీ నాయకులు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్ర, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి రాణించారన్నారు. అటువంటి గొప్పదనం తెలుగుదేశం పార్టీదన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 20% బీసీ రిజర్వేషన్ ను అమలు చేసిన ఘనత నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, తెలుగుదేశం పార్టీకి దక్కిందన్నారు. అంతకు ముందు దేశంలో ఎప్పుడూ కూడా బీసీ వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్ లేదన్నారు. ఆ రిజర్వేషన్లను ముందుకు కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతానికి బీసీ రిజర్వేషన్లను పెంచడం, దాని ద్వారా స్థానిక సంస్థల్లో అనేకమంది ప్రతినిధులు రావడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల నుంచి వచ్చిన ప్రతినిధులు అనేకమంది చట్టసభల్లో ఉన్నారంటే అందుకు తెలుగుదేశం పార్టీ చొరవే కారణమన్నారు. మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం,అంబేద్కర్ ఆశించిన అసమానతలు లేని సమాజం, సామాజిక న్యాయం సాధించాలంటే అన్ని వర్గాల వారికి సముచితంగా న్యాయం కావాలనేదే తెలుగుదేశం పార్టీ మూల సిద్ధాంతమని తెలియజేశారు. వైసిపి (గొడ్డలి) పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. బీసీ వర్గాల వారిని అణగదొక్కి బీసీలకు ఇచ్చే రుణాలను, ఆదరణ తదితర పథకాలను రద్దు చేసి వారిని ఇబ్బందులు పాలు చేయడం జరిగిందన్నారు. కొన్ని మంత్రి పదవులు బీసీలకు ఇచ్చినా పెత్తనం మాత్రం వారి సొంత సామాజిక వర్గానికి చెందిన వారే చేశారని విమర్శించారు.రాష్ట్రాన్ని నాలుగైదు ప్రాంతాలుగా విభజించి విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల్లో అధికారాన్ని ఉంచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు కీలక స్థానాల్లో మంత్రి పదవులు అందజేసిందన్నారు. సమాజం ముందడుగు వేయాలంటే బీసీ వర్గాల వారిని ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చక్కని నిర్ణయం తీసుకుందని కొనియాడారు. గొడ్డలి పార్టీ అన్యాయం చేస్తూ 24 శాతానికి తగ్గించిన రిజర్వేషన్లను నేడు 34 శాతానికి పెంచుతూ క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడానికి స్వాగతిస్తున్నామని, ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

## గ్రంథాలయం లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి




**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్)ఆగస్ట్ 18**

గిద్దలూరు శాఖా గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు తొలుత నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పుష్ప మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు విశ్రాంత బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి మాట్లాడుతూ నేతాజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం దేశభక్తి, ధైర్యసాహసాలు యువతలో జాతీయ స్ఫూర్తిని నింపిన ఆయన సేవలను స్మరించుకున్నారు ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్న కుమారి కుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటి ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి వాసవి జాగృతి మిత్ర మండలి క్లబ్ అధ్యక్షులు వంశీ కృష్ణ యువ ప్రగతి పథంస్వచ్ఛంద సంస్థ వ్యవస్థపకులు సయ్యద్ ఫరూఖ్ తదితరులు హాజరయ్యారు.

## ఉత్తమ మండల విద్యాశాఖ అధికారి గిరిధర్ శర్మకు ఘన సన్మానం



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్)ఆగస్ట్ 18**

గిద్దలూరు పట్టణానికి చెందిన వారణాసి గిరిధర్ శర్మ ప్రస్తుతం రాచర్ల మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత చేతుల మీదుగా ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గిద్దలూరు హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది కలిసి దుశ్శాలువతో, పూలమాల, జ్ఞాపిక తో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ గిరిధర్ శర్మ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఎన్.సి.సి ఆఫీసర్ డాక్టర్ మొర్రి. పిచ్చయ్య మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులందరితో స్నేహపూర్వకంగా ఉంటు పనిచేయిస్తూ రాచర్ల మండలాన్ని అన్ని విషయాల్లో ముందు వరుసలో నిలుపారన్నారు. ఈ కార్యక్రమంలో బాల గురవయ్య, స్వామి కుమార్, విజయరాజు, శ్రీరామిరెడ్డి, సగీర్,పీరయ్య, శోభారాణి మరియం బీబీ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొని గిరిధర్ శర్మకు శుభాకాంక్షలు తెలిపారు.

## అనుమానమే కారణం..

### భర్తను కొట్టి చంపిన భార్య తండ్రి, సోదరుడు



**పీసీపల్లి, (సిటిజన్ టైమ్స్)ఆగస్ట్ 18**

మండలంలోని మూలవారిపల్లి గ్రామంలో దాంపత్య కలహాలు విషాదంగా మారాయి. భార్యను అనుమానంతో వేధిస్తున్న భర్తను, ఆమె కుటుంబ సభ్యులు కలిసి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం మూలవారిపల్లికి చెందిన మూల పుల్లారెడ్డి కుమార్తె ధనలక్ష్మికి పామూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కందుల శ్రీకాంత్ రెడ్డితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీకాంత్ రెడ్డి భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. దీంతో సుమారు 4 ఏళ్ల క్రితం ధనలక్ష్మి ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చేసి, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో పది రోజుల క్రితం శ్రీకాంత్ రెడ్డి మూలవారిపల్లికి వచ్చి భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 10 న మళ్లీ గొడవపడి ధనలక్ష్మి పై దాడి చేశాడు. మనస్తాపానికి గురైన ధనలక్ష్మి ఫినాయిల్ తాగగా, ఆమెను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. 13న ఆమె డిశ్చార్జ్ అయింది. ఆ తర్వాత కూడా 14న శ్రీకాంత్ రెడ్డి ఇంటికి వచ్చి మరోసారి గొడవకు దిగాడు. దీంతో ధనలక్ష్మి తన తండ్రి పుల్లారెడ్డి, సోదరుడు మల్లికార్జున రెడ్డికి విషయం చెప్పింది. ఆగ్రహంతో ముగ్గురు కలిసి కర్రలు, రోకలి బండతో శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేశారు. తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం 17.08.2026 సాయంత్రం 6 గంటలకు నిందితులైన ధనలక్ష్మి, పుల్లారెడ్డి, మల్లికార్జున రెడ్డిని అరెస్ట్ చేశారు. మంగళవారం 18న ముగ్గురిని కనిగిరి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

# అచ్చన్న నోరు అదుపులో పెట్టుకో

### – బొత్సపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి –శాసనమండలి డైవర్షన్ కోసమే బొత్సపై టార్గెట్

### – వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్...



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

అచ్చం నాయుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సీనియర్ నాయకుడిగా, రాష్ట్ర మంత్రిగా హుందాతనం ప్రదర్శించాలి, కానీ ఇలా దిగజారి మరొక సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పై నోరు పారేసుకోవడం సిగ్గుచేటని తక్షణమే క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వై.యస్.ఆర్.సి.పి యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ డిమాండ్ చేశారు. కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొత్స విద్యాశాఖ మంత్రిగా ఉండగా ఈ రాష్ట్రంలో నాడు-నేడు ద్వారా స్కూళ్లు బాగుపడ్డాయి, ప్రభుత్వ స్కూళ్లకు సిబియస్ఇ సిలబస్ తీసుకొచ్చారు, మీడియంతో సంబంధం లేకుండా పిల్లలకు సబ్జెక్ట్ అర్థం అయ్యేలా బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు తీసుకొచ్చారు, ఇప్పుడు మీరు గొప్పలు చెప్పుకుంటున్న డీఎస్సీలో కూడా ఆయన మంత్రిగా ఉండగా నోటిఫికేషన్ ఇచ్చిన పది వేల పోస్టులు ఉన్నాయి. మీరు దానికి కేవలం ఆరు వేలు పోస్టులు కలిపేసి మెగా డీఎస్సీ అని డప్పు కొట్టుకుంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే విద్యా వ్యవస్థపై ఆయన మార్క్ కనపడుతుంది.అచ్చం నాయుడు ఇప్పుడు మంత్రిగా ఉన్న వ్యవసాయశాఖ పరిస్థితేంటి,ఈ రెండేళ్లలో ఒక్కసారైనా రైతులకు విత్తనాలు, యూరియా, ఎరువులు సమయానికి అందించావ, మామిడి, మిరప, పొగాకు, వరి, ఆక్వా ఏ ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర ఇప్పించావా. ఎరువులు దొరకక రోజుల తరబడి రైతులు క్యూ లైన్లో నిలబడే పరిస్థితి, సకాలంలో నీరు కూడా అందించే పరిస్థితి లేదు పంటలు ఎండిపోతూ, రైతు నాశనం అవుతున్న సంగతి చూస్తూనే ఉన్నాంగా. మరి దద్దమ్మ ఎవరు ప్రజలు కూడా గుర్తిస్తున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము లేక, మండలిలో వైసీపీ సభ్యులు లేవనెత్తే సమస్యలపై సమాధానాలు చెప్పలేక, అక్కడ జరుగుతున్న చర్చల ద్వారా ప్రజలకి వాస్తవాలు తెలిసే ప్రమాదం ఉన్నందున భయంతో డైవర్షన్ కోసం బాబు స్క్రిప్ట్ ను అచ్చన్న అమలుపరుస్తారని అన్నారు. ఇకపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు మానుకుంటే మంచిదని, ప్రజలు అమాయకులు కాదని అన్ని గమనిస్తారు ఎవరు దద్దమ్మలో వారే తెలియజేస్తారన్నారు. మా పార్టీ పెద్దన్న బొత్స సత్యనారాయణ పై మరొకసారి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది అని అచ్చెన్నను హెచ్చరించారు.

## గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ ముమ్మర గాలింపు చర్యలు

### కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి

### – మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమరావతి, రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 18**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులతోను, అధికారులు తోనూ అమరావతి నుంచి ఫోన్ ద్వారా మాట్లాడిన మంత్రి, ప్రభుత్వం ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తోందని పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన కొపనాతి రామకృష్ణవర్మతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు ఆగస్టు 3న చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లారని, ఇప్పటికే వెనక్కి తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ నేటివరకు వారి ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. వేటకు వెళ్లిన తర్వాత మూడు రోజుల వరకు కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడిన మత్స్యకారులు, అనంతరం అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ భరోసా కల్పించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు ప్రభుత్వం వారి కుటుంబాలకు అండగా ఉంటుందని, గాలింపు చర్యలు మరింత వేగవంతం అయ్యేలా సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గల్లంతైన మత్స్యకారుల జాడ కనిపించే వరకు అధికార యంత్రాంగం విశ్రాంతి లేకుండా పనిచేస్తుందని ఆయన తెలిపారు.

# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలి

### – నో-బిడ్స్ మరింత తగ్గాలి.. రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపట్టాలి

### – పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో తాజా పరిస్థితిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష



**అమరావతి (సిటిజన్ టైమ్స్)ఆగస్ట్ 18**

రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్లు వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో నో-బిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, 'నో-బిడ్స్'ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మాధురీ జైన్ జగన్ గందరగోళం లో ప్రశాంతత నెలకొంది



# శ్రీహరి వారసుడు.. ఈసారి భయపెట్టాలా థ్రిల్లర్ లుక్

రియల్ స్టార్ శ్రీహరి వారసుడు మేఘాంశ్ మరో డిఫరెంట్ కాన్సెప్ట్ తో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఆ కొత్త సినిమా రీసెంట్ గానే మొదలైంది. 'ఆస్మాన్' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేశారు. ఇక ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను లేటెస్ట్ గా శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో చేతిలో పాత లాంతరు పట్టుకుని మేఘాంశ్ కనిపిస్తున్నాడు. లాంతరు చుట్టూ పగిలిపోతున్న గాజు, వెనుక చీకటి వాతావరణంతో లుక్‌ను రఫ్‌గా డిజైన్ చేశారు.మోషన్ పోస్టర్‌లో ఫైర్, పెద్ది చేయి లాంటి విజువల్స్ కూడా చూపించారు. కథను చెప్పకుండా జానర్ మీద మాత్రం చిన్న హింట్ ఇచ్చేలా మొత్తం పోస్టర్ ఉంది. మేఘాంశ్‌కు 'ఆస్మాన్' కీలకమైన సినిమా. 2019లో 'రాజ్‌దూత్'తో హీరోగా పరిచయమైన ఈ యువ హీరోకు ఆ తర్వాత పెద్ద గ్యాప్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ లీడ్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు.రెగ్యులర్ కథ కాకుండా థ్రిల్లర్ జానర్‌లో కొత్తగా ప్రయత్నించాలని ఫిక్స్ అయ్యాడు. 'ఆస్మాన్'ను డిఫరెంట్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్‌కు కూడా కథలో ఉంటుందని టీమ్ మొదటి నుంచే చెబుతోంది. ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న లాంతరు, మోషన్ పోస్టర్‌లోని భారీ విజువల్స్ కూడా అదే మూడ్‌ను కొనసాగించాయి. అయితే మేఘాంశ్ పాత్ర ఏంటి, పురాణాలకు కథతో ఉన్న లింక్ ఏంటి అనే వివరాలను మాత్రం బయటపెట్టలేదు. ఈ సినిమాతో రామ్ నందన్ తెలుగు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. రామ్ మైథాలజీ, ఫాంటసీ సినిమాల్లో తనదైన ముద్ర వేసిన కోడి రామకృష్ణ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశాడు. ఇప్పుడు అదే అనుభవంతో తెలుగు ప్రేక్షకులకు 'ఆస్మాన్' తీసుకొస్తున్నాడు. శ్రీ క్లిన్‌కారా సెల్యులోయిడ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మాతలు.ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తుండగా షోయబ్ అహ్మద్ కెమెరామెన్ గా వర్క్ చేస్తున్నారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, అరబిక్ భాషల్లోనూ సినిమాను తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇక 'ఆస్మాన్'తో మాత్రం మేఘాంశ్ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే ఫస్ట్ లుక్‌లోనూ గత సినిమాతో పోలిక లేకుండా కొత్త టోన్ ఎంచుకున్నారు. మరి అతని కెరీర్‌కు ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను ఇస్తుందో చూడాలి.




## అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుం



# పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రికి అర్జున అవార్డు.. క్రీడా పురస్కారాల పూర్తి జాబితా...

- 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు
- మొత్తం 17 మంది క్రీడాకారులను వరించిన అర్జున పురస్కారం
- ఈ ఏడాది ఎవరికీ మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు ప్రకటించని కేంద్రం
- చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కూడా అర్జున
- పలువురు కోచ్‌లకు ద్రోణాచార్య, క్రీడా ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు




కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:**

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)
తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)
ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)
నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)
విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)
లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)
సుర్జీత్, పూజ (కబడ్డీ)
ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)
ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)
అరవింద్ సింగ్ (రోయింగ్)
అఖిల్ షెయోరాన్ (షూటింగ్)
అర్జున అవార్డు (జీవన సాఫల్యం)
అరుమై నాయగం (ఫుట్‌బాల్)
ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)
ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)
పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)
నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)
జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)
ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)
వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)
రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్
ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

# 84కే 4 వికెట్లు.. మరో 288 రన్స్ చేస్తేనే లంక గెలిచేది.. లేకపోతే విజయం భారత్‌దే







భారత్ వర్సెస్ శ్రీలంకల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు ముగిసే సమయానికి టీమిండియా పూర్తి పైచేయి సాధించింది. ఆతిథ్య లంక జట్టు ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఇక ఇన్నింగ్స్ లో లభించిన 178 పరుగుల ఆధిక్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన భారత్, చివరకు శ్రీలంకను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. లంక గెలవాలంటే ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉండగా, టీమిండియాకు చారిత్రాత్మక విజయం సాధించడానికి కేవలం 6 వికెట్లు తీస్తే సరిపోతుంది. భారత జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో కొనసాగలేదు. క్రమశిక్షణతో కూడిన లంక బౌలింగ్‌కు వరుసగా ఇండియన్ బ్యాటర్లు వికెట్లు పారేసుకోవడంతో జట్టు 193 పరుగులకే ఆలౌట్ అయింది. అయినప్పటికీ, తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 178 పరుగుల భారీ లీడ్ పుణ్యమా అని శ్రీలంక ముందు 372 పరుగుల టార్గెట్ ని ఉంచగలిగింది. గాలే పిచ్‌పై చివరి రోజు ఈ కొండంత స్కోరును ఛేజ్ చేయడం లంకకు కష్టమే అని చెప్పాలి.


**84/4 వద్ద నిలిచిన నాలుగో రోజు ఆట:**

లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు బ్రేకులు వేశారు. పక్కా ప్లానింగ్‌తో దాడి చేసిన టీమిండియా బౌలర్లు, లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీస్తూ 4 కీలక వికెట్లను నేలకూల్చారు. వెలుతురు లేమి

కారణంగా 34 ఓవర్లు ముగిశాక నాలుగో రోజు ఆటను నిలిపివేసే సమయానికి శ్రీలంక 84 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం క్రీజులో సోనల్ దినూష (25 రన్స్), ధనంజయ డి సిల్వా (31) నాటౌట్ గా కొనసాగుతున్నారు. కాగా మ్యాచ్ రేపటికి వాయిదా పడినప్పటికీ, విజయం మాత్రం దాదాపు భారత్ సొంతమైనట్లే కనిపిస్తోంది.

# గిల్‌క్రిస్ట్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన పంత్.. టెస్టుల్లో 100 సిక్సర్లు పూర్తి!




భారత వికెట్‌కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ సుదీర్ఘ ఫార్మాట్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా అరుదైన మైలురాయిని అందుకని రికార్డు పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. భారత్ ఆడుతున్న తాజా టెస్ట్ మ్యాచ్‌లో తన ట్రేడ్‌మార్క్ అటాకింగ్ షాట్‌తో ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే 100 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు బాదిన నాలుగో బ్యాటర్‌గా పంత్ నిలిచాడు.

రిషభ్ పంత్ అటాకింగ్ శైలి ఎంత ప్రమాదకరమైనదో అతని గణాంకాలే చెబుతున్నాయి. టెస్టుల్లో ప్రతి 49 బంతులకు ఒక సిక్సర్ చొప్పున బాది పంత్ సంచలనం సృష్టించాడు. ఈ విషయంలో దిగ్గజ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ప్రతి 67 బంతులకు ఒక సిక్సర్) రికార్డును కూడా పంత్ సునాయాసంగా బ్రేక్ చేసేశాడు.

**ఒత్తిడిలోనూ పంత్ సూపర్ హాఫ్ సెంచరీ:**

తరచుగా విమర్శలు ఎదుర్కొనే పంత్, కష్టసమయంలో జట్టుకు కొండంత అండగా నిలిచాడు. మొదటి సెషన్‌లో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలే ప్రమాదంలో పడిన వేళ, పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ క్రమంలోనే పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 20వ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. జట్టుకు టాప్ స్కోరర్‌గా నిలిచి, భారత జట్టు ఆధిక్యాన్ని 350 పరుగుల దాకా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన విధ్వంసకర బ్యాటర్ల ఎలైట్ క్లబ్‌లో పంత్ చేరాడు. ఈ జాబితాలో టాప్-4లో ఉన్న ఆటగాళ్ళు:

బెన్ స్టోక్స్ - 138 సిక్సర్లు
బ్రెండన్ మెక్‌కలమ్ -107 సిక్సర్లు
రిషభ్ పంత్ - 100లి సిక్సర్లు
ఆడమ్ గిల్‌క్రిస్ట్ - 100 సిక్సర్లు

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776